క్లుప్తంగా

మద్ది ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం శ్రీ మద్ది ఆంజనేయస్వామి క్షేత్రం మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ ప్రధానార్చకులు వేదాంతం వెంకటాచార్యులు స్వామి వారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ: 1,30,116 వచ్చినట్లు, 1,000 మంది భక్తులు స్వామి వారి అన్నప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ ఈవో ఆకుల కొండలరావు తెలిపారు. ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

బుట్టాయగూడెం సర్పంచ్ వెంకాయమ్మకు సత్కారం



సర్పంచ్ వెంకాయమ్మ దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : ఉపాధి హామీ పథకంలో నీటిసేకరణ సంరక్షణ పనులకు జాతీయ స్థాయిలో అవార్డు అందుకున్న బుట్టాయగూడెం సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, దేవరాజు దంపతులను మంగళవారం పలువురు ఘనంగా సన్మానించారు. ఎంపీపీ కారం శాంతి, వైస్ ఎంపీపీ కుక్కల వరలక్ష్మి, సర్పంచ్ జోడే సత్యదుర్గాప్రసాద్, ఉప సర్పంచ్ సరియం చల్లయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కారం వెంకటరమణతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మారుమూల గిరిజన ప్రాంతం నుంచి ఢిల్లీ స్థాయిలో గుర్తింపు సాధించేందుకు కృషి చేసిన వెంకాయమ్మ, ఉపాధి హామీ పథకం అధికారులను ఈ సందర్భంగా వారు అభినందించారు.

పౌర్ణమి రోజున అమ్మవారికి పల్లకీసేవ



విజయదుర్గ అమ్మవారికి పల్లకీ సేవ నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని శ్రీ విజయదుర్గ అమ్మవారికి ప్రతి నెలా పౌర్ణమి రోజు పల్లకీ సేవ నిర్వహించాలని ఆలయ కమిటీ నిర్ణయించినట్లు అధ్యక్షుడు ఎం.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి ఎం.రామ్మోహన్‌రావు తెలిపారు. సోమవారం రాత్రి అమ్మవారికి ఆలయ కమిటీ సభ్యులు పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తులు ధార్మిక సేవల్లో పాల్గొనే విధంగా కార్యక్రమాలు రూపొందిచనున్నామని, దీనిలో భాగంగా పల్లకీ సేవ నిర్వహించేందుకు నిర్ణయించామన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

12 టన్నుల రేషన్ బియ్యం పట్టివేత

జంగారెడ్డిగూడెం: చింతలపూడి నుంచి కాకినాడ పోర్టుకు అక్రమంగా రవాణా అవుతున్న 12 టన్నుల రేషన్ బియ్యాన్ని జంగారెడ్డిగూడెం ఎస్సై ఎం.సాగర్‌బాబు పట్టుకున్నారు. సోమవారం రాత్రి స్థానిక జాతీయ ప్రధాన రహదారిపై గల చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా, అక్రమంగా బియ్యం రవాణా చేస్తున్నట్లు గుర్తించారు. చింతలపూడి మండలం రాఘవాపురానికి చెందిన గుబ్బల శ్రీనివాసరావు ఈ బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు చెప్పారు. లారీ డ్రైవర్ తాళ్లూరి నానిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పిచ్చికుక్క స్వైర విహారం.. 20 మందికి గాయాలు



బాధితులకు తాత్కాలిక చికిత్స అందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: పిచ్చికుక్క స్వైర విహారంతో సుమారు 20 మందికి పైగా గాయాల పాలయ్యారు. మంగళవారం సాయంత్రం నుంచి రేపల్లె వాడ, అంకాల గూడెం, మహాలక్ష్మి థియేటర్ ఏరియాలలో కుక్క స్వైర విహారం చేసినట్లు బాధితులు చెబుతున్నారు. కుక్క దాడిలో గాయపడిన 14 మంది కొయ్యలగూడెం యూజీపీహెచ్‌సీలో చికిత్స తీసుకొనగా, కొందరు ప్రైవేటు హాస్పిటల్స్‌ను ఆశ్రయించినట్లు తెలిసింది. కొన్ని కేసులను జంగారెడ్డిగూడెం హాస్పిటల్‌కి రిఫర్ చేసినట్లు వైద్యాధికారులు తెలిపారు. కుక్కను పట్టుకోవడానికి చర్యలు చేపట్టామని సర్పంచ్ ఎం.విజయ కుమారి పేర్కొన్నారు.

మహిళా లోకం.. స్ఫూర్తిదాయకం..



తహసీల్దార్ కృష్ణజ్యోతిని సత్కరిస్తున్న దృశ్యం



చింతలపూడి : సమాజంలో స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో మంగళవారం స్ఫూర్తి స్వచ్ఛంద సంస్థ, మహిళా సాధికారిక సంస్థల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్ మాట్లాడుతూ ఉన్నత శిఖరాలను అధిరోహించిన మహిళలను నేటితరం ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. అనంతరం తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, జెడ్పీటీసీ ఎం నీరజా సుధాకర్‌లను సత్కరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు మొహిద్దీన్ పాష, జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్‌ఎం ఎం.చక్రధరరావు, ఎంపీడీఓ మణికుమారి, వైద్యాధికారిణి డా అబిద, మహిమాల, ఆరోగ్య విస్తరణ అధికారి ఎస్‌కే అబ్రార్ హుస్సేన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మానవత ఆధ్వర్యంలో...

మానవత సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణజ్యోతి, ఎంపీడీఓ మణికుమారి, డిప్యూటి తహసీల్దార్ షేక్ షకీలాలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మానవత అధ్యక్షుడు కె.నాగచిన్నారావు, అన్నవరపు రామలక్ష్మి, కె.నాగలక్ష్మి, చైర్మన్ ఎ.అప్పారావు, కార్యదర్శి ఎ. రాజారావు, గౌరవ డైరెక్టర్ డా.అన్నవరపు సత్యన్నారాయణ, పి.సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు చట్టాలపై అవగాహన అవసరం

జంగారెడ్డిగూడెం : స్థానిక ఛత్రపతి శివాజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవాం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షత వహించారు. వైస్ ప్రిన్సిపాల్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరికి ముఖ్యంగా మహిళలకు, విద్యార్థినులకు చట్టాలపై అవగాహన తప్పనిసరి అని అన్నారు. ఎన్ని చట్టాలు వచ్చినా కొన్ని సందర్భాలలో మహిళలపై దాడులు జరుగుతూనే ఉన్నాయన్నారు. ఎవరైనా ఇబ్బంది కలిగిస్తున్నారని భావించినప్పుడు వెంటనే టోల్ ఫ్రీ నంబరికి కానీ, లేదా తెలిసిన వారిని గానీ ఆశ్రయించడం మంచిదన్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక జంగారెడ్డిగూడెం కోర్టు అడ్వకేట్స్ పీఎస్‌ఆర్‌కె.లక్ష్మణరావు, ఏవీవీ భువనేశ్వరి, బి లలిత కుమారి, జె.బాబుజీరావు, టి.రాంబాబు ఫ్యామిలీ లా గురించి, పెళ్లి విడాకులకు సంబంధించిన చట్టాల గురించి ఆస్తులలో మహిళలకు ఉన్న హక్కుల గురించి వివరించారు. కార్యక్రమంలో మహిళా సాధికార విభాగ అధిపతి టి.ఝాన్సీ రాణి, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ మెంబర్స్ ఆర్.విజయ దీపిక, సీహెచ్.రమాదేవి, కేవీవీ శిరీష, సీహెచ్. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

విభిన్న సంస్కృతులను గౌరవించాలి



హోళీ వేడుకల్లో పాల్గొన్న వందనపు సాయిబాల పద్మ

జంగారెడ్డిగూడెం : విభిన్న సంస్కృతులను గౌరవించుకుంటూ పండుగలు నిర్వహించుకోవాలని ఐసీడీఎస్ రీజనల్ కో-ఆర్డినేటర్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ అన్నారు. పట్టణంలో మంగళవారం నిర్వహించిన హోళీ వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. కుల, మత, వర్గాలకు అతీతంగా అందరూ కలిసి ఎంతో ఉత్సాహంగా నిర్వహించుకునే పండుగ హోళీ అన్నారు. జంగారెడ్డిగూడెం పట్టణంలో ఏటా హోళీని ఘనంగా నిర్వహించుకుంటున్నారని, ఈ సారి అదే ఆనందంతో నిర్వహించుకోవాలన్నారు. సంస్కృతిని గౌరవించుకుంటూ, భవిష్యత్తు తరాలకు అందిచేందుకు ఆ సంస్కృతిని కాపాడుకుంటూ ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు ఆమె హోళీ శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, చిత్రంలో ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా

జంగారెడ్డిగూడెం : స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా ధీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో మంగళవారం పట్టణంలో జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, మున్సిపల్ కౌన్సిలర్‌లకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మిథున్ రెడ్డి, కోటగిరి శ్రీధర్, రాష్ట్ర మంత్రి కారుమూరు నాగేశ్వరరావు పాల్గొని ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా విలేకరులతో మాట్లాడారు. టీడీపీ , జనసేన పార్టీలు కుట్రపూరిత రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో రెండు ఎమ్మెల్సీ స్థానాలకు పార్టీ మ్యాండెట్‌లు ఇచ్చి అభ్యర్థులను నిలబెట్టలేకపోయారని, వారి అభ్యర్థులనే స్వతంత్రులుగా మార్చి వారికి మద్దతు ఇస్తున్నామని ప్రకటించడం కుటిల రాజకీయమే అన్నారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఏకగ్రీవాలు అవుతాయని తెలిసినా కుట్ర పూరితంగా వ్యవహరించడం ఒక్క టీడీపీకే చెల్లిందని మండిపడ్డారు. ఉమ్మడి పశ్చిమలో స్థానిక సంస్థల్లో మొత్తం 1105 ఓట్లు ఉండగా, వాటిలో 891 ఓట్లు వైఎస్సార్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులవే అని, కావున వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయం తథ్యమని అన్నారు. ప్రస్తుతం నిర్వహించే ఈ ఎమ్మెల్సీ ఎన్నికలు రాబోయే సార్వత్రిక ఎన్నికలు ఒక సూచికగా మారినందున వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు అందరూ సమిష్టిగా పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలుపొందేలా కృషిచేయాలని కోరారు.

సామాజిక సమతుల్యత

సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాల్లో సామాజిక సమతుల్యత పాటిస్తున్నారని ఎమ్మెల్సీ అభ్యర్థులు కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్, ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా అన్నారు. రాష్ట్రంలో 18 స్థానాల్లో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగుతుంటే అన్ని వర్గాలకు ప్రాధాన్యత కల్పిస్తూ సీట్లు కేటాయించారన్నారు. 18 స్థానాల్లో నాలుగింటిని అగ్రవర్ణాలకు కేటాయించి, మిగిలినవి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బడుగు బలహీనవర్గాలకు కేటాయించారని, ఆయన ముందు చూపుతో తీసుకుంటున్న నిర్ణయాలు, సమాజంలో అణగారిన వర్గాలకు సైతం రాజకీయంగా ముందుకు వచ్చేందుకు అవకాశాలు ఏర్పడుతున్నాయన్నారు. ఉమ్మడి పశ్చిమలో ఎమ్మెల్సీలను అఖండ మెజార్టీతో గెలిపించి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని కోరారు.

కనకదుర్గమ్మ ఉత్సవాలు ప్రారంభం



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న ఆలయ ధర్మకర్తలు, కమిటీ సభ్యులు

బుట్టాయగూడెం : మండలంలోని రెడ్డిగణపవరంలో కొలువై భక్తుల పూజలందుకుంటున్న కనకదుర్గమ్మ, అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామివారి 98వ ఉత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజాము నాలుగున్నరకు విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త భౌమరాజు ధనంజయరాజు, కమిటీ వారు నూతన వస్త్రాలు సమర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, రేపాకులు చంద్రం, కలగరనాని, గాడి వెంకటరెడ్డి, అనుపోజు మురళి, యాండ్ర రవి తదితరులు కనకదుర్గమ్మ తల్లి, అన్నపూర్ణాదేవి, విశ్వేశ్వర స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని దూప, దీప నైవేద్యాలతో పూజలు చేశారు. తొలిరోజు తిరునాళ్లలో జానపద నృత్యాన్ని ఏర్పాటు చేశారు. ఈ నృత్య ప్రదర్శనలు భక్తులను అలరించాయి.

పూర్వ విద్యార్థుల కలయిక



పంగిడిగూడెం హైస్కూల్‌లో కలిసిన పూర్వ విద్యార్థులు

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని పంగిడిగూడెం హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ హైస్కూల్‌లో 2002-2003 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థులంతా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా చదువుకున్న రోజులను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. మండల విద్యాశాఖాధికారి బుద్దుల రాముడిని పూర్వ విద్యార్థులు సత్కరించారు.

దళితులకు రాజ్యాంగ ఫలాలు అందించేందుకు కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లం ఆనందప్రకాష్

జంగారెడ్డిగూడెం : దళిత జాతుల అభ్యున్నతి కోసం భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కులను వారికి అందేలా చట్టపరమైన బాధ్యతను ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ తీసుకుంటుందని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ కమిషన్ సభ్యులు చెల్లం ఆనంద ప్రకాష్ హామీ ఇచ్చారు. మంగళవారం ఉదయం పట్టణంలోని ప్రియదర్శిని డిగ్రీ కళాశాల ఆవరణలో ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ అలుగు ఆనంద శేఖర్ అధ్యక్షత వహించగా ఆనంద్‌ప్రకాష్ ప్రసంగించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వారి జీవితాన్ని అర్పించి సాధించిన రాజ్యాంగ ఫలాలు ఈ దేశంలో ఉన్న దళితుల అందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాల మీద, ఎస్సీ కమిషన్ల మీద ఆధారపడి ఉందని ఉద్ఘాటించారు అంబేడ్కర్ ఆశించిన సమసమాజ నిర్మాణానికి ఏపీ ప్రభుత్వం హితోధికంగా కృషి చేస్తుందని, దాన్ని సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలన్నారు. దళితుల అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని ఈ సందర్భంగా కొనియాడారు. కార్యక్రమంలో జంగారెడ్డిగూడెం మున్సిపాలిటీ కౌన్సిల్ సభ్యులు వెంప ఐజాక్, కనుమూరి లావణ్య, మానుకొండ కిషోర్, గంజి వినోద్, కాటన్ ప్రసాదు, గొల్లమందల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ముందుగా కమిషన్ సభ్యులు చెల్లం ఆనంద ప్రకాష్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల అలంకరణ చేశారు. అనంతరం జంగారెడ్డిగూడెం ప్రాంతంలోని వివిధ దళిత గిరిజన సంఘాల నాయకులు చెల్లం ఆనంద ప్రకాష్‌ను ఘనంగా సన్మానించారు.

గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలి



సచివాలయ మహిళా పోలీసులతో సమీక్షిస్తున్న ఎస్సై కె.వెంకన్న

కామవరపుకోట : మండలంలో అసాంఘిక కార్యకలాపాలు అరికట్టాలని తడికలపూడి ఎస్సై కె.వెంకన్న అన్నారు. వారాంతపు సమీక్షలో భాగంగా మంగళవారం స్థానిక తడికలపూడి పోలీస్‌స్టేషన్ ఆవరణలో గ్రామ సచివాలయ మహిళా పోలీసులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై వెంకన్న మాట్లాడుతూ దిశ యాప్‌ను ఎక్కువమంది వినియోగించుకునేలా అవగాహన కల్పించాలని, గ్రామాల్లో కోడిపందేలు, పేకాట, సారా అమ్మకం వంటి అసాంఘిక కార్యకలాపాలు అరికట్టేందుకు కృషి చేయాలని మహిళా పోలీసులకు సూచించారు. విద్యార్థులకు పరీక్షల సమయం కావడంతో గ్రామాల్లో మైక్ శబ్దాలను నివారించాలని, తిరునాళ్లలో పండుగ సందర్భాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చూడాలని ఒకవేళ ఎక్కడైనా ఇబ్బందికర పరిస్థితి ఎదురైతే వెంటనే పోలీస్‌స్టేషన్ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మహిళా పోలీసులతో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

మానవత్వం చాటిన పోలీసులు



వృద్ధుడిని ఆటోలో వృద్ధాశ్రమానికి తరలిస్తున్న మహిళా పోలీస్ లక్ష్మీసుజన

ద్వారకాతిరుమల : రోడ్డు పక్కన నిస్సహాయ స్థితిలో పడి ఉన్న ఒక వృద్ధుడిని పోలీసులు మంగళవారం వృద్ధాశ్రమంలో చేర్చి మానవత్వాన్ని చాటారు. పంగిడిగూడెం శివారులో రోడ్డుపక్కన ఒక వృద్ధుడు పడి ఉండడాన్ని చూసిన ద్వారకాతిరుమల సచివాలయం-2 మహిళా పోలీస్ పి.లక్ష్మీ సుజన విషయాన్ని భీమడోలు సీఐ వెంకటేశ్వరరావుకు తెలిపింది. దీనిపై వెంటనే స్పందించిన సీఐ ఆ వృద్ధుడిని వృద్ధాశ్రమానికి తరలించాలని సూచించారు. ఈ క్రమంలో మహిళా పోలీస్ లక్ష్మీ సుజన, మరో కానిస్టేబుల్ ఆ వృద్ధుడిని ఆటోలో నిడదవోలులోని వృద్ధాశ్రమానికి తరలించి, ఆశ్రమ నిర్వాహకులు చర్ల సుశీల, బండి వెంకటేశ్వరరావులకు అప్పగించారు.

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరు

పెదపాడు: కేంద్రం అనుసరిస్తున్న కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలపై నిరసనగా చేపట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయు అధ్యక్షుడు బీ సోమయ్య తెలిపారు. పెదపాడులోని నర్రా ఆంజనేయులు భవనంలో సీఐటీయూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో మండల స్థాయి కార్మిక కర్షక ఐక్యతా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న సోమయ్య మాట్లాడుతూ కేంద్ర మోదీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తూ, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మికులు పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను తుంగలో తొక్కిందని ఆందోళన వ్యక్తం చేసారు. కనీస వేతనం రూ.26 ఇవ్వాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో ఏపీ కౌలురైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్, పి దుర్గ, లింగం కృష్ణారావు, రెడ్డి లక్ష్మణరావు పాల్గొన్నారు.

ఆగమ పాఠశాలలో శ్రీలక్ష్మి జయంతి



శ్రీలక్ష్మీ అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఆగమ విద్యార్థులు

ద్వారకాతిరుమల : లక్ష్మీపురంలోని శ్రీవారి దేవస్థానం ఆగమ పాఠశాలలో మంగళవారం ఆగమ విద్యార్థులు శ్రీలక్ష్మీ జయంతి వేడుకలను అట్టహాసంగా నిర్వహించారు. ఏటా ఫాల్గుణ మాసంలో వచ్చే పౌర్ణమినాడు శ్రీలక్ష్మీ జయంతి వేడుకలను జరపడం ఇక్కడ సంప్రదాయంగా వస్తోంది. అందులో భాగంగా పాఠశాల ఆవరణలో అమ్మవారి ప్రతిమను ఉంచి, ఆగమ విద్యార్థులు విశేష పూజాధికాలను జరిపారు. క్షీరసాగర మదనంలో ముందు హాలాహలం ఉద్భవించగా, చివరిలో లక్ష్మీమాత జన్మించినట్టు పురాణాలు చెబుతున్నాయని ఆగమ గురువులు తెలిపారు. భక్తితో అమ్మవారిని ఆరాధిస్తే లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందని పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి

జంగారెడ్డిగూడెం : చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి చెందినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. వివరాల ప్రకారం ఈ నెల 5న తాడువాయికి చెందిన పేరుబోయిన బ్రహ్మమ్మ ఇంట్లో ఉన్న సమయంలో ప్రమాదవశాత్తు దుస్తులకు నిప్పు అంటుకుని ఇళ్లంతా మంటలు వ్యాపించాయి. బ్రహ్మమ్మ కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఈ ఘటనలో బ్రహ్మమ్మకు తీవ్ర కాలిన గాయాలు కాగా ఆమెను జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె మంగళవారం మృతి చెందింది. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం, మృతురాలి కోడలు పేరుబోయిన సత్యవతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

ఎమ్మెల్యే బాలరాజుకు మంత్రులు, ఎంపీల పరామర్శ



ఎమ్మెల్యే బాలరాజును పరామర్శిస్తున్న మంత్రులు, ఎంపీలు

బుట్టాయగూడెం: గుండె సంబంధిత చికిత్స పొంది విశ్రాంతి తీసుకుంటున్న పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజును రాష్ట్ర పౌర సరఫరాల శాఖామంత్రి కారుమూరి నాగేశ్వరరావు, రీజనల్ కోఆర్డినేటర్లు రాజ్యసభ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్, పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థులు కవూరు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ మంగళవారం సాయంత్రం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకున్నారు. సంపూర్ణమైన ఆరోగ్యంతో త్వరగా కోలుకుని మళ్లీ ప్రజలతో మమేకమై పార్టీ అభివృద్ధికి కృషి చెయ్యాలని కోరారు. పోలవరం, చింతలపూడి నియోజకవర్గాలకు చెందిన పలువురు నాయకులు కూడా ఎమ్మెల్యే బాలరాజును పరామర్శించి ఆరోగ్యస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాలరాజును పరామర్శించేందుకు వచ్చిన మంత్రులు, ఎంపీలను బాలరాజు కుమారుడు తెల్లం సాయి విశాల్, జెడ్పీటీసీ సభ్యుడు సామంతపూడి సూరిబాబు, నాయకులు అల్లూరి రత్నాజీరావు, ఆరేటి సత్యనారాయణ, కరాటం కృష్ణస్వరూప్, మట్టా సత్తిపండు, గొడ్డాడి నాగేశ్వరరావు, శంకు కొండ, దినేష్ శాలువాలు కప్పి పుష్పగుచ్ఛం ఇచ్చి ఆహ్వానించారు.

బాధితులకు అండగా ఉంటాం



అధికారులతో మాట్లాడుతున్న బాలరాజు

బుట్టాయగూడెం : వేలేరుపాడు మండలంలోని కన్నాయిగుట్టలో జరిగిన అగ్నిప్రమాద బాధితులను అన్ని విధాల ఆదుకుంటామని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. కన్నాయిగుట్ట గ్రామంలో అగ్ని ప్రమాదం జరిగినట్లు సమాచారం అందిన వెంటనే వేలేరుపాడు మండంలోని అధికారులు, వైఎస్సార్ సీపీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాద ఘటనకు సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నట్లు చెప్పారు. బాధితులకు ప్రభుత్వ పరంగా అందే తక్షణ సహాయ కార్యక్రమాలు వెంటనే అందేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు కోరినట్లు ఆయన చెప్పారు. బాధితులకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు తమ వంతు సహాయ సహకాలు అందించాలని కోరారు.

చండీహోమం

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని నూకాలమ్మ ఆలయంలో పౌర్ణమి పురస్కరించుకుని సోమవారం రాత్రి 48వ చండీ హోమం వైభవంగా నిర్వహించారు. వీరంపాలెం శ్రీ బాలా త్రిపురసుందరి పీఠం ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్ అమ్మవారిని దర్శించి, హోమ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హరే శ్రీనివాస శ్రీఅభయాంజనేయ కోలాట భజన బృందం చింతామణి, తాడేపల్లి ఉమాదేవి నేతృత్వంలో కోలాటం నిర్వహించారు. భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక వేత్త కనుపర్తి లక్ష్మీ నరసింహ ధనకుమార్, ప్రధానార్చకులు యర్రమిల్లి మనోజ్ శర్మ, కోనే రాజేష్ ఝాన్సీ దంపతులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు రాజాన సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బాబాకు విశేష పూజలు



ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చిన సాయిబాబా

టి.నరసాపురం : మక్కినవారిగూడెంలో షిర్డీ సాయిబాబా ఆలయ వార్షికోత్సవం మంగళవారం ముగిసింది. ఈ సందర్భంగా సాయినాధునికి రుద్రపారాయణతో వేద పండితులు అనిపెద్ది సుధీర్‌శర్మచే పంచామృతాభిషేకం నిర్వహించారు. అఖండ అన్నసమారాధన జరిపించారు. అనంతరం పల్లకీసేవ, దీపాలంకరణ వైభవంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని తరించారు. ఈ సందర్భంగా సాయినాథుడిని ప్రత్యేకంగా అలంకరించారు.

ధ్యానం శక్తివంతమైనది

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ధ్యానం వల్ల మానసిక ప్రశాంతత పొందవచ్చని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ప్రతినిధి ప్రబోధ్ తెలిపారు. పిరమిట్ స్పిరిచ్యువల్ సొసైటీ మూవ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో పౌర్ణమి ధ్యాన కార్యక్రమం స్థానిక ఒన్‌టౌన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర్ణమి రోజు గంట సేపు చేసే ధ్యానం సాధారణ దినాల్లో మూడు గంటల పాటు చేసే ధ్యానంతో సమానమన్నారు. ధ్యానం చేయడం ద్వారా అన్ని శారీరక అనారోగ్య సమస్యలతో పాటు మానసిక, ఆర్థిక సమస్యలను ఎదుర్కొనే శక్తినిస్తుందన్నారు.

శ్రీవారి విమానగోపుర స్వర్ణమయ పథకానికి విరాళం



దాత మేఘన కుటుంబానికి విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ చైర్మన్ సుధాకరరావు

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ విమానగోపుర స్వర్ణమయ పథకానికి ఓ భక్తురాలు మంగళవారం రూ.1,00,116 లను విరాళంగా అందజేశారు. జి.కొండూరు మండలం కుంటముక్కల గ్రామానికి చెందిన సుఖవాసి మేఘన ఈ విరాళాన్ని ఆన్‌లైన్‌లో చెల్లించగా, దాత కుటుంబానికి ఆలయ చైర్మన్ ఎస్వీ.సుధాకరరావు విరాళం బాండ్ పత్రాన్ని అందించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త ఎస్వీ.నివృతరావు తదితరులున్నారు.